

మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలి
నవరాత్రి ఉత్సవాల్లో మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు.

- 8లో



బహుజనులకు అండగా ఉంటా
దళిత బహుజనులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.

- 8లో



ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా
హుజూర్‌నగర్‌లోని ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ బదిలీల సీనియారిటీ జాబితా విడుదల

నల్లగొండ: ఉపాధ్యాయుల బదిలీలు, ఖాళీల తాత్కాలిక జాబితాను విద్యా శాఖ ఆదివారం ప్రకటించింది. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఆదివారం జిల్లా విద్యా శాఖ జిల్లాలోని బదిలీలకు సంబంధించి 4,416 మంది దరఖాస్తులు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఆయా ఉపాధ్యాయులకు ఎన్ని పాయింట్లు వచ్చాయనే జాబితాను తాజాగా ప్రకటించారు. అదేవిధంగా జిల్లాలో ప్రస్తుతం తప్పనిసరి బదిలీలు అవుతున్న స్థానాలతోపాటు జిల్లాలో ఎక్కడెక్కడ ఏయే సబ్జెక్టులకు సంబంధించి ఎన్ని ఖాళీలు ఉన్నాయో సీనియారిటీ ప్రకారం జాబితాను విడుదల చేశారు. ఈ నెల 14న హెడ్‌మాస్టర్లకు బదిలీలు జరుగనున్నాయి. ఆ తరువాత స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించనున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు

నల్లగొండ: విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షలో రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 25 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఘనపురం భీమయ్య డిమాండ్ చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు నల్లగొండలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికి ఏడవ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు ఎస్టీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించి దీక్ష విరమింపజేయాలని కోరారు.

మేరు కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి



నూతన కార్యవర్గానికి నియామక పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారులు

నల్లగొండ టౌన్: మేరు కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మేరు సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు రేణిగుంట్ల రామ్మూర్తి అన్నారు. ఆదివారం నల్లగొండలోని జిల్లా మేరు సంఘం కార్యాలయంలో జరిగిన సంఘం ఎన్నికలలో నూతన అధ్యక్షుడిగా ఎన్నికై అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫామ్ కుట్టే కాంట్రాక్టును మేరు కులస్తులకు ఇవ్వాలన్నారు. మేరు కులస్తుల సంక్షేమానికి ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఆధునిక జూకీ మిషన్లు ఇవ్వాలని, ఉచిత కరెంట్, కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి రుణాలు ఇవ్వడంతోపాటు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అర్హులైన వారికి బీసీ బంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా తెంబరేణి రామకృష్ణ, కోశాధికారిగా టంగుటూరి సురేష్, కార్యవర్గ సభ్యులుగా నియమితులైన పానుగంటి విజయలక్ష్మి, నామ శేషమ్మ, మునగాల శంకర్, రాపర్తి నెహ్రూ బాబు, పానుగంటి రాము, శ్రీనివాస్ వాడపల్లి రఘునాథ్, గుంటి కృష్ణ రేణిగుంట్ల వెంకటయ్య, ఎం.సంధ్యలకు ఎన్నికల అధికారులు గుంటి నరేందర్, తాళ్ల వెంకటేశ్వర్లు నియామక పత్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నామ రాంప్రసాద్, కార్యదర్శి రాపర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట: ఏకాదశిని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల పుష్పాలు, తులసీ దళాలతో పూజించారు. ఈ వేడుకలో ఈఓ గీతారెడ్డి పాల్గొన్నారు. ఇక ప్రధానాలయంలో విశేష పూజలు కొనసాగాయి. ఆలయ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, గజవాహనసేవ, బ్రహ్మోత్సవం, వెండి జోడు సేవలు నిర్వహించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

పథకాలు అందేదెలా..!

ఏడేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేయని ప్రభుత్వం

- కొత్త అర్జీలకు, మ్యుటేషన్లకు కలగని మోక్షం
- సంక్షేమ పథకాలకు తప్పనిసరి కావడంతో తీవ్ర ఇబ్బందులు
- కార్డుల్లేక వివిధ స్కీంలకు దూరమవుతున్న పేదలు



రేషన్ కార్డుల వివరాలు..

కార్డుల సంఖ్య	4,66,529
ఆహార భద్రత	4,36,408
అంత్యోదయ	30,058
అన్నపూర్ణ	63
కొత్త కార్డులు, మ్యుటేషన్‌కు వచ్చి దరఖాస్తులు	24,000

నల్లగొండ: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే తెల్లరేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. ఈ నిబంధన ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైన తరువాత ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులను ఇవ్వలేదు. 2016లో మాత్రం ఆహార భద్రత కార్డులను జారీ చేసింది. ఆ సందర్భంలో చాలా మంది కొత్తగా కార్డులు, పేర్ల మార్పిడి, పిల్లల పేరు ఎక్కించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే అలాంటి సమస్యలు అన్ని పరిష్కారం కాకపోను చాలా మందికి కొత్తగా రేషన్ కార్డులు అందని పరిస్థితి నెలకొంది. ఆతరువాత ప్రభుత్వం రేషన్ కార్డులకు సంబంధించి ఆన్‌లైన్ సైట్‌ను బందు పెట్టింది. ప్రస్తుతం ప్రభుత్వం సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలంటే అధికారులు రేషన్ కార్డులు తప్పనిసరిగా ఉండాలని చెబుతుండడంతో చాలామంది పేదలు పథకాలకు దూరమవుతున్నారు.

రేషన్ కార్డుల్లేక.. వేలాది దరఖాస్తుల తిరస్కరణ..

తెలంగాణ ప్రభుత్వం నూతనంగా గృహలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు సొంతిల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థికసాయం చేస్తోంది. ఇందుకోసం ఇటీవల జిల్లా వ్యాప్తంగా పేదల నుంచి దరఖాస్తులను స్వీకరించగా మొత్తం 78,890 మంది దరఖాస్తు వచ్చాయి. అందులో నియోజకవర్గానికి 3 వేల మందికి ఇళ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాల పరిధిలో 18 వేల మందికి మొదటి విడతగా లబ్ధి పొందనున్నారు. అయితే ఈ పథకానికి వచ్చిన మొత్తం దరఖాస్తుల్లో కేవలం 11 వేల మందిని మాత్రమే అధికారులు అర్హులుగా గుర్తించారు. ఇందులో తెల్ల రేషన్ కార్డులు లేక చాలా మంది దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఇదిలా ఉంటే బీసీ కులవృత్తిదారులకు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించింది. ఈ పథకానికి మొత్తం 41,863 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కూడా రేషన్ కార్డులేని వారి వేలాది దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. వీటితోపాటు మైనార్టీ బంధు పథకంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఫలితంగా తాము ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్నామని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త రేషన్ కార్డులతోపాటు పేర్ల మార్పులు, కొత్తగా పిల్లల పేర్లు ఎక్కించి కొత్త కార్డులు పంపిణీ చేయాలని పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు కోరుతున్నారు.

రేషన్ కార్డు అందించాలి



తెల్ల రేషన్ కార్డు లేకపోవడంతో మేము గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోలేక పోయాము. గతంలో డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా రాలేదు. 2016లో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకు ఇవ్వలేదు. రేషన్ కార్డు ఉంటేనే పథకాలకు అర్హులని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా రేషన్ కార్డు ఇచ్చి ఆదుకోవాలి.

– అంబటి సంధ్య, పెద్దదేవులపల్లి

తెల్ల రేషన్‌కార్డు లేక దరఖాస్తు చేసుకోలేదు



నాకు రేషన్ కార్డు లేదు. చాలా కాలం క్రితం దరఖాస్తు చేసుకున్నాను. అయినా కార్డు రాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తుంది. కానీ, రేషన్ కార్డులేక నేను దరఖాస్తు చేసుకోలేక పోయాను. ప్రభుత్వ పథకాలన్నింటికీ రేషన్ కార్డు తప్పనిసరి చేసి పేదలకు అవి పంపిణీ చేయకపోవడంతో పథకాల ఫలాలు అందరికీ అందడం లేదు.

– శ్రీకాంత్, హనుమాన్ పేట, మిర్యాలగూడ

తెల్ల రేషన్ కార్డు ఉంటేనే..

ప్రస్తుతం ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన గృహలక్ష్మి, బీసీలకు ఆర్థిక సాయం, మైనార్టీ బంధు, దళిత బంధు పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే ప్రతిఒక్క దరఖాస్తుదారు తప్పనిసరిగా తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలి. లేదంటే దరఖాస్తు చేసుకున్నా కూడా ఆన్‌లైన్‌లో తీసుకోని పరిస్థితి. అయినా కొందరు ఆన్‌లైన్‌లో కాకుండా కొన్ని పథకాలకు నేరుగా తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకున్నారు. ఆ దరఖాస్తుల ఆధారంగా అక్కడ ఆన్‌లైన్ చేశారు. కానీ, రేషన్ కార్డులేక పోవడంతో చాలా మంది దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్లోడ్ కాకపోవడంతో అధికారులు వాటిని తిరస్కరిస్తున్నారు.

మైనార్టీల భద్రతకు అట్రాసిటీ యాక్ట్ తేవాలి



మాట్లాడుతున్న మౌలానా సయ్యద్ మహమూద్ అసాద్ మదనీ

- జమియతుల్ ఉలేమా ఆల్ ఇండియా అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మహమూద్ అసాద్ మదనీ

రామగిరి(నల్లగొండ): ఎస్సీ ఎస్టీల మాదిరిగా మైనార్టీల భద్రతకు అట్రాసిటీ యాక్ట్ తీసుకురావాలని జమియతుల్ ఉలేమా ఆల్ ఇండియా అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మహమూద్ అసాద్ మదనీ డిమాండ్‌చేశారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్ వద్ద జమియతుల్ ఉలేమా నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మౌలానా సయ్యద్ ఎహసానుద్దీన్ ఖాస్మీ అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. మత ప్రవక్తలపై కించ పరిచేలా వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలను రూపొందించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలని కోరారు. గడిచిన పదేళ్లలో ముస్లింలపై జరిగిన దాడులపై నిష్పక్షపాతమైన విచారణ జరిపించి బాధితులకు సత్వర న్యాయం చేయాలన్నారు. ప్రార్థనా స్థలాలు, మత సంస్థలకు రక్షణ కల్పించాలన్నారు. వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం పరిరక్షించాలన్నారు. జనాభా దామాషా ప్రకారం మైనార్టీలకు ఎన్నికల్లో టికెట్లు, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు. వెనుకబడిన ముస్లింలకు విద్యా ఉద్యోగ రంగాల్లో 4 శాతం రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాశివారి(స్టోన్ కట్టర్స్) కార్మికులకు ఆసరా ఫించన్ ఇవ్వాలన్నారు. మత సేవకులకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రుణాలు మంజూరు చేయాలని కోరారు. మైనార్టీలకు కేటాయించిన బడ్జెట్‌ను ముస్లింల కోసం ఖర్చు చేయాలన్నారు. ఉర్దూ మీడియం స్కూళ్లలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ఉర్దూ భాషకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలన్నారు. ఈ సభలో జమియతుల్ ఉలేమా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షుడు హాఫిజ్ పీర్ షబ్బీర్ అహ్మద్, రెండు తెలుగు రాష్ట్రాల జనరల్ సెక్రటరీ హాఫిజ్ పీర్ ఖలీఖ్ అహ్మద్ సాబిర్, నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలానా అక్బర్ ఖాన్ అసాదీ, ఉపాధ్యక్షుడు ముఫ్తీ సయ్యద్ సిద్దీఖ్ అహ్మద్ మజాహిరి, మౌలానా సయ్యద్ అక్బర్, నిజామాబాద్ మౌలానా ముఫ్తీ సమియుల్లా, భువనగిరి మౌలానా సయ్యద్ అక్బర్ మిఫ్తాయి, మౌలానా ఖాలిఖ్ సాహెబ్, మౌలానా తాహెర్, మౌలానా అతీహర్ పాల్గొన్నారు.



నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో నిర్వహించిన జమియతుల్ ఉలేమా మహాసభకు హాజరైన ముస్లింలు

తెలంగాణ ధీరవనిత.. చాకలి ఐలమ్మ



నల్లగొండ : ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ధీర వనిత చాకలి ఐలమ్మ అని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డులో గల ఐలమ్మ విగ్రహం వద్ద ఆమె వర్ధంతిని మున్సిపాలిటీ, రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తికోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం నిజాం నవాబులకు, జమీందార్లకు వ్యతిరేకంగా పోరాడిన వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, అబ్బగోని రమేష్‌గౌడ్, అభిమన్యు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూసీ ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో అధికారులు ఆదివారం నాలుగు క్రస్టు గేట్లను పైకెత్తి 5,202 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి మూసీకి 4,717క్యూసెక్కుల వరదనీరు వస్తుంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 643.65 అడుగుల వద్ద ఉంది. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 481క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గేట్ల ద్వారా, కాల్వలకు మొత్తం ప్రాజెక్టు నుంచి 5,764 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.11 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

పులిచర్లను మండలంగా ఏర్పాటు చేయాలి

పెద్దవూర: మండలానికి కావాల్సిన అన్ని మౌలిక వసతులు ఉన్న పులిచర్లను నూతన మండలంగా ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పులిచర్లను నూతన మండలంగా ఏర్పాటు చేయాలని పెద్దవూర, పీఏపల్లి మండలాలకు చెందిన 12గ్రామ పంచాయతీల ప్రజలు, నాయకులు పులిచర్ల గ్రామంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. పులిచర్లను మండలంగా ఏర్పాటు చేయాలని 12 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు తీర్మానాలు చేసి పంపించిన పాలకులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ప్రస్తుతం పెద్దవూర, పీఏపల్లి మండల కేంద్రాలకు చాలా గ్రామాలు చాలా దూరంలో ఉన్నందున ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పులిచర్లను మండలంగా ఏర్పాటు చేస్తే 12 జీపీల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. మండలంగా ఏర్పాటు చేసే దాకా ఉద్యమాన్ని ఆపే ప్రసక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి సైదమ్మనాగయ్య, ఎంపీటీసీ దేవసాని లక్ష్మమ్మపుల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, లక్ష్మయ్య, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న శ్రీధర్‌రెడ్డి, నాయకులు

గద్దర్, జహీర్ అలీఖాన్‌ల మృతి తీరని లోటు

- ఓయూ ప్రొఫెసర్ కాశీం

నల్లగొండ: ప్రజాయుద్ధ నౌక గద్దర్, సియాసత్ ఉర్దూ పత్రిక ఎడిటర్ జహీర్ అలీఖాన్‌ల మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఓయూ ప్రొఫెసర్ కాశీం అన్నారు. నల్లగొండ పట్టణంలోని టీఎన్‌జీఓస్ భవన్‌లో ఆదివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన గద్దర్, జహీర్ అలీఖాన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై గద్దర్, జహీర్ అలీఖాన్‌ల చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. గద్దర్ పాడిన పాటలను పాడి ఆయన స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలు కష్టసుఖాల్లో పాడుకునే జాన పదాలను ప్రపంచానికి చాటిచెప్పడం కోసం గద్దర్ విప్లవీకరించారని గుర్తు చేశారు. భూస్వామ్య దోపిడీ, పీడనలను ఎదిరించడం కోసం ప్రజలను పోరాటం వైపు మళ్లించేందుకు గద్దర్ పాటను ఆయుధంగా చేసుకున్నారన్నారు. గద్దర్ రాసిన 600 పైగా పాటలలో ప్రజల బాధలు గాథలే ఉన్నాయన్నారు. గద్దర్, జహీర్ అలీఖాన్‌లు ఇద్దరు మిత్రులుగా అనేక ప్రజా సమస్యలపై పోరాడారని కొనియాడారు. ఇద్దరు ఒకేసారి మృతి చెందడం బాధాకరమని, వారి ఆశయ సాధనలో అందరం భాగస్వాములం కావాలని పిలుపునిచ్చారు. దర్శనం నర్సింహ, సుధాకర్‌రెడ్డి, మొహితుల్లా అధ్యక్షతన జరిగిన సభలో మా భూమి సంధ్య, ప్రజా కళా మండలి నాయకుడు రాంనర్సయ్య, గాదె ఇన్నయ్య, మహ్మద్ షాబుద్దీన్, గురువయ్య, డాక్టర్ ఏఏఖాన్, బురిడ్మియా పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం, చిత్రంలో వివిధ సంఘాల నాయకులు

ఓటరు నమోదుపై | కళాశాలల్లోనూ అవగాహన

- డిగ్రీ, ఆఫైస్థాయి కాలేజీల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- ఇప్పటికే నల్లగొండ పట్టణంలో మొదలైన ప్రక్రియ
- నేటి నుంచి దేవరకొండ నియోజకవర్గంలో..
- పోలింగ్ శాతం పెంపే లక్ష్యంగా ఎన్నికల సంఘం కార్యాచరణ



నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ రవికుమార్ (ఫైల్)

గత నెల 21న ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లా ఓటర్లు

మహిళలు	6,90,072
పురుషులు	6,94,335
థర్డ్ జెండర్	118
మొత్తం ఓటర్లు	13,84,525

దేవరకొండ: రానున్న సాధారణ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంపే లక్ష్యంగా ఎన్నికల సంఘం నూతన సంస్కరణలు చేపడుతోంది. ఇందులో భాగంగా రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. పద్దెనిమి ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసుకునేలా మొబైల్ వాహనాల ద్వారా గ్రామాలు, పట్టణాల్లో అధికారులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఓటు ఎలా వేయాలి అని వీవీ ప్యాట్‌లు, ఈవీఎంలపై ఓటర్లకు క్షుణ్ణంగా అవగాహన కల్పించేందుకు ఆరు నియోజకవర్గాల్లో ఒక్కొక్కటీ అలాగే కలెక్టరేట్‌లో అదనంగా మరొకటి మొత్తం ఏడు మాక్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తద్వారా వేలాది మందికి ఓటేయడంపై అవగాహన కల్పించారు. దీనికితోడు కొత్త ఓటర్లు నమోదయ్యేలా యువతరానికి ఓటు హక్కు ప్రాధాన్యత వివరించేలా జూనియర్ కాలేజీలు మినహా డిగ్రీ, డిగ్రీ సమానమైన ఇంజనీరింగ్, బీఎస్సీ నర్సింగ్, డీఈడీ డిప్లొమా, పీజీ, బీఈడీ కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా నల్లగొండ నియోజకవర్గంలో ఈ ప్రక్రియ మూడు రోజులు క్రితమే ప్రారంభం కాగా సోమవారం నుంచి దేవరకొండ నియోజకవర్గంలో డిగ్రీ, ఆపైస్థాయి కోర్సులు గల కళాశాలల్లో ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఆయా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాల ద్వారా అర్హులైన కొత్త వారిని నమోదు చేయడం వల్ల పదిశాతం ఓటర్లు పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

పెరగనున్న ఓటర్లు

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్క పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా ఇటు అధికారులు.. అటు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో జిల్లాలో పెద్ద ఎత్తున యువత ఓటర్లుగా నమోదు అవుతున్నారు. అంతే కాకుండా రెవెన్యూ అధికారులు 1,766 పోలింగ్ బూతుల్లో కొత్త ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించారు. వార్డుల వారీగా బీఎల్ఓలను నియమించి ఓటరు నమోదుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో గత జనవరిలో 13,55,482 మంది ఓటర్లు ఉండగా ఆగస్టులో ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం 13,84,520 మంది ఉన్నారు. అంటే 29,043 మంది కొత్త ఓటర్లు పెరిగారు. అక్టోబర్ 4న తుది ఓటరు జాబితా ప్రకటించనున్న నేపథ్యంలో ఓటరు నమోదు సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలి




18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలి. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు నమోదుపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. అందులో భాగంగా దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని 308 పోలింగ్ బూత్‌ల పరిధిలో మొబైల్ వాహనాల ద్వారా ప్రచారం నిర్వహించాం. నేటి నుంచి కళాశాలల్లో యువతకు ఓటు నమోదుపై అవగాహన కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

– ముబీన్, ఎలక్షన్ డీటీ, దేవరకొండ

వృద్ధులు, దివ్యాంగులు.. ఇంటి వద్దనుంచే ఓటేసేలా..

ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగుల దగ్గరకే ఈవీఎం మిషన్లను తీసుకెళ్లి వారితో ఓటు వేయించారు. దీంతో అక్కడ జరిగన ఎన్నికల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. త్వరలో రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విధానాన్ని అమలు చేసేందుకు గాను ఎన్నికల సంఘం అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

మహాసభను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలిండియా సమతా సైనిక్ దళ్ నాయకులు

దేవరకొండ: ఆలిండియా సమతా సైనిక్ దళ్ పదో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య పిలుపునిచ్చారు. ఆదివారం దేవరకొండలోని రహదారి బంగ్లాలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా సామాజిక పరివర్తనను పెంపొందించడమే ఆలిండియా సమతా సైనిక్ దళ్ లక్ష్యమన్నారు. స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం సాధనే ధ్యేయంగా ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయమల్ల నర్సింగరాజ్, ఏర్పుల శ్రీనివాస్, వెంకటస్వామి, బుర్రి వెంకన్న, మేడి కృష్ణ, ఏకుల రాజారాం, జిల్లా అధ్యక్షుడు భిక్షపతి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐలమ్మ ఆశయ సాధనకు కృషిచేయాలి



ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విమలక్క తదితరులు

రాజాపేట : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని అరుణోదయ సాంస్కృతిక కళాకారిణి విమలక్క అన్నారు. ఆదివారం మండలంలోని జాల గ్రామంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకల్లో ఆమె పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ గొల్లపల్లి రాంరెడ్డి, ఉపసర్పంచ్ నర్సింహులు, నాయకులు మొగిలి ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి : సూర్యాపేట జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి మహాక్షేత్రంలో గల శ్రీ రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య, శాశ్వత కల్యాణాన్ని అర్చకులు వేద మంత్రోచ్ఛరణాల నడుమ ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన, అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్ కుమార్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

పట్టపగలే మూడిళ్లలో చోరీ

- 9తులాల బంగారం, 25తులాల వెండి, రూ.48వేల నగదు అపహరణ
- సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు



సీసీ ఫుటేజీలో కన్పిస్తున్న దుండగుడు



దొంగతనం జరిగిన మద్ది సుదర్శన్‌రెడ్డి ఇల్లు ఇదే

భూదాన్‌పోచంపల్లి : తాళం వేసిన ఇళ్లలో పట్టపగలే చోరీ జరిగింది. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ చోటు చేసుకోగా విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ స్టేజీ వద్ద ఊరుచివరలో మద్ది సుదర్శన్‌రెడ్డి, మద్ది యాదిరెడ్డి, మద్ది రాజిరెడ్డి నివాసం ఉంటున్నారు. వారిలో మద్ది సుదర్శన్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం 12గంటలకు ఇంటికి తాళం వేసి ఓ శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం 5.40 గంటలకు రాగా ఇంటి తాళాలు పగలకొట్టి నట్లు ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 8తులాల బంగారం, 25తులాల వెండి పట్టాగొలుసులు, 40వేల నగదును గుర్తు తెలియని దుండగుడు అపహరించినట్లు గుర్తించాడు. అలాగే ఇతడి ఇంటి వెనుకాలే ఉంటున్న మద్ది యాదిరెడ్డి కూడా మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లాడు. కాగా దుండగులు యాదిరెడ్డి ఇల్లు ప్రహారి దూకి ఇంటి తాళాలు పగుల గొట్టి బీరువాలో ఉన్న తులం బంగారం, 8వేల నగదును ఎత్తుకెళ్లాడు. అనంతరం యాదిరెడ్డి ఇంటి ప్రక్కనే ఉన్న మద్ది రాజిరెడ్డి ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో ఉన్న వస్తువులను చిందరవందరగా చేశాడు. రాజిరెడ్డి కుటుంబం హైదరాబాద్‌లో ఉంటుండడంతో వారి ఇంట్లో బంగారం, నగదు లభించలేదు.

చోరీ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు..

కాగా మద్ది సుదర్శన్‌రెడ్డి ఇంట్లో ఏర్పాటు చేసి సీసీ కెమెరాల్లో దుండగుడు చోరీ చేసిన దృశ్యాలన్నీ రికార్డు అయ్యాయి. సుమారు 40ఏళ్ల వయస్సు కలిగిన యువకుడు పాయింట్, టీషర్ట్ ధరించి తన పల్సర్‌బైక్‌ను సుదర్శన్‌రెడ్డి ఇంటి ఆవరణలో చెట్టు కింద పార్కింగ్ చేశాడు. మొదట సుదర్శన్‌రెడ్డి ఇంట్లోకి ప్రవేశించాడు. అక్కడ జామ చెట్టు కింద ఉన్న పారతో తాళం విరగ్గొట్టడానికి ప్రయత్నించి విఫలం చెందాడు. అనంతరం మద్ది యాదిరెడ్డి ఇంట్లోకి వెళ్లగా అక్కడ పైప్ రేంచ్‌పానతో ఇంటి గొళ్లాలు విరగ్గొట్టి లోనికి వెళ్లి చోరీ చేశాడు. అలాగే యాదిరెడ్డి ఇంట్లో యాదిరెడ్డికి చెందిన తెల్ల షర్ట్ వేసుకొని తన గీతల టీషర్ట్‌ను మాత్రం భుజం మీద వేసుకొన్నాడు. అనంతరం రాజిరెడ్డి ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లోని వస్తువులను చిందరవందరగా చేశారు. మళ్లీ చివరగా మద్ది సుదర్శన్‌రెడ్డి ఇంటికి వచ్చి రెంచ్‌పానాతో గొళ్లెం విరగ్గొట్టి బీరువాను కింద పడేసి అందులోఉన్న సొత్తును చోరీ చేశాడు. అనంతరం బయటికి వచ్చిన దుండగుడు పార్కు చేసిన బైక్‌పై జూలూరు వైపు వెళ్లిపోయాడు. కాగా విషయం తెలుసుకొన్న అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, చౌటుప్పల్ రూరల్ సీఐ మహేశ్, ఎస్ఐ విక్రమ్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూటీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి ఇంట్లో ఉన్న సీసీ కెమెరాల్లోని సీసీ ఫుటేజీతో పాటు పోచంపల్లి, జూలూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలి



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి చిత్రంలో కలెక్టర్, ఎస్పీ, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు

- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : నవరాత్రి ఉత్సవాల్లో మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని స్టేట్ చాంబర్‌లో భానుపురి గణేష్ ఉత్సవ కమిటీతో నిర్వహించిన గణేష్ నవరాత్రుల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 18న వినాయక చవితి పండుగ, 27న విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఉత్సవ కమిటీకి మంత్రి సూచించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టితో చేసిన గణేష్ విగ్రహాలు ప్రతిష్ఠించాలని ఆయన కమిటీని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి కొత్త చట్టాలను ఏర్పాటు చేసిందని, దీంతో రాష్ట్రంలో 7శాతం గ్రీనరీ అభివృద్ధి జరిగిందన్నారు. పర్యావరణకు మన వంతు బాధ్యతగా మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలన్నారు. మట్టి విగ్రహాలను వార్డుకు రెండు నుంచి మూడు, ప్రతి ఇంటికి పూజ కొరకు చిన్న మట్టి విగ్రహాలు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధికారులు, పోలీసులు, గణేశ్ ఉత్సవ కమిటీలతో నవరాత్రులు విజయవంతంగా నిర్వహించడానికి త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.వెంకట్రావు, ఎస్పీ రాజేంద్రప్రసాద్, డీఎస్పీ నాగభూషణం, ఆర్డీఓ వీరబ్రహ్మచారి, మున్సిపల్ వైస్‌చైర్మన్ పుట్టా కిషోర్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు బైరు వెంకన్న, సకిలం రాజేశ్వర రావు, రుక్మారావు, పర్వతం శ్రీధర్, రామిశెట్టి నవీన్, అయుఖాన్, బాలసైదులుగౌడ్, శ్రీనివాస యాదవ్, రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి బాలుడు మృతి



జశ్వన్ మృతదేహం

నాంపల్లి : వైద్యం వికటించి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జాన్‌తండా గ్రామానికి చెందిన రామావత్ రత్య సాలీ దంపతుల కుమారుడు జశ్వన్ (14) రెండు రోజులుగా దగ్గు, జలుబుతో బాధపడుతున్నాడు. దీంతో బాలుడిని అతడి తాత ఆదివారం ఉదయం మండల కేంద్రంలోని శ్రీనివాస ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ఆసుపత్రిలో ఉన్న ఆర్ఎంపీ డాక్టర్ కృష్ణ బాలుడిని పరీక్షించి ఐడోస్ ఇంజక్షన్ నరానికి ఇవ్వడంతో ఒక్కసారిగా స్పృహ కోల్పోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు చండూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వారు బాలుడు మృతిదేహంతో బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ నవీన్‌కుమార్ ఘటన విషయంలో జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి రూ.10లక్షల పరిహారం అందించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం బాలుడి మృతిదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండకు తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రమావత్ తావుర్యా (ఫైల్)

డిండి : విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కే.గౌరారంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందంపేట మండలంలోని పోల్యానాయక్‌తండాకు చెందిన రమావత్ తావుర్యా (60)కు మండలంలోని కే.గౌరారం గ్రామ రెవెన్యూ శివారులో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే పొలాన్ని వచ్చిన తావుర్యా ఆదివారం ఉదయం బోర్‌మోటార్‌ను ఆన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు ఎస్ఐ.సైదులు తెలిపారు. మృతుడి కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

దళిత బహుజనులకు అండగా ఉంటా

- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : దళిత బహుజనులకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిప్పర్తి పరిధిలోని తిప్పలమ్మగూడెంలో బాల త్రిపుర సుందరి రథయాత్రలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి కరుణ కటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉంటాలన్నారు. తిప్పర్తి మండలం అంటే తనకు అమితమైన ప్రేమ ఉందన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నానని అన్నారు. ఎవ్వరికీ ఆపద వచ్చినా ఆదుకుంటానని అన్నారు. కార్యక్రమంలో తిప్పర్తి మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు బద్దం సుధీర్, మండల అధ్యక్షుడు జూకూరి రమేష్, ఎంపీటీసీ పల్లె ఎల్లయ్య, గుమ్ముల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

చౌటుప్పల్ : మండలంలోని నేలపట్ల గ్రామ స్టేజీ వద్ద ఉన్న మద్యం దుకాణంలో శనివారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్వాహకులు రాత్రి 10గంటల తర్వాత దుకాణం మూసి వెళ్లారు. ఆ తర్వాత అర్ధరాత్రి దాటాక దుకాణం పైకప్పులో ఉన్న సిమెంట్ రేకులను పగులగొట్టిన దుండగులు లోనికిప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.5వేల నగదుతో పాటు 30వేల విలువైన మద్యం ఎత్తుకెళ్లారు. ఆదివారం దుకాణం తెరిచిన నిర్వాహకులు దొంగతనం విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదగిరి తెలిపారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, మిర్యాలగూడ.

ఇ.పి.నెం.34 ఆఫ్ 2017

బిట్వీన్ :-

తిరివీది జనార్ధన్ రావు ...డిక్రి హోల్డర్

VS

మహ్మద్ గులామ్ ముస్తాఫా చనిపోయినందున అతని వారసులు మహ్మద్ గౌస్ మరియు ఇతరులు ...జడ్జిమెంట్ డెబిటార్సు

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా. పైన తెలిపిన ఇ.పి.యందలి డిక్రిహోల్డర్ అయిన తిరివీది జనార్ధన్‌రావు గారికి పైన తెలిపిన జడ్జిమెంట్ డెబిటార్స్ నుండి రావాల్సిన బాకీ బాపతు రూ.2,01,585,00 (ఇపి వేసిన నాటి నుండి వడ్డీ మరియు కోర్టు ఖర్చులు లెక్కించవలయును) రూపాయలు రాబట్టు కొనుటకై పైన తెలిపిన జడ్జిమెంట్ డెబిటార్సు గార్లకు సంబందించిన దిగువ తెలిపిన షెడ్యూల్ స్థిర ఆస్థిని డిక్రిహోల్డర్ గారికి మార్టగేజ్ చేసిన వ్యవసాయ భూమి తేది.26.09.2023 ఉదయం 10-30 గంటలకు లగాయతు సదరు పైన తెలిపిన కోర్టువారి సమక్షంలో వేలం వేసి అమ్మబడును. కావున అట్టి భూమిని కొనదలచిన వారు సదరు వేలంలోపాల్గొని వేలం పాట పాడుకొనవచ్చును. (కొనుక్కోవచ్చును) మిగతా వివరాలకు పై కోర్టు వారి నాజరు గారి వద్ద పొందగలరు.

వేలం వేయు షెడ్యూల్ ఆస్తి వివరములు

నల్లగొండ జిల్లా, మిర్యాలగూడ మండలం, ముల్కలకాలువ రెవెన్యూ గ్రామము శివారు లోని సర్వే నెం.90/ఆ యందు ఎ.4-12 గుంటలు వ్యవసాయ భూమి దీనికి హద్దులు : **తూర్పు:** కేశవాపురం డొంక, **పడమర:** జడ్జిమెంట్ డెబిటార్స్ యొక్క భూమి, **ఉత్తరం:** బండ్ల బాట, **దక్షిణం:** రుద్రారం వాగు.

డిక్రిహోల్డర్ విలువ రూ.20,00,000/-లు J.Drs విలువ తెలుపలేదు. బేయిలీఫ్ విలువ:-, మార్కెట్ విలువ అందాజ రూ.4,15,000/- సబ్ రిజిస్ట్రార్ విలువ ఎకరానికి రూ.4,50,000/-

(కోర్టు వారి అనుమతితో)

ఇట్లు

(ఎల్.అంజయ్య) B.A.,LL.B.

డిక్రిహోల్డర్ తరపు న్యాయవాది

ఇ.నెం.9-68, సీతారాంపురం, మిర్యాలగూడ టౌన్ & మండలం, నల్లగొండ జిల్లా. సెల్: 9440678142

మిర్యాలగూడ

తేది.09.09.2023

బురిడీ కొట్టించి బంగారు పుస్తెలతాడు చోరీ



కొంగులో కట్టిన గులక రాళ్లను చూపిస్తున్న బాధితురాలు

భూదాన్‌పోచంపల్లి : మెడలో ఉన్న బంగారాన్ని దొంగలు చూస్తే దొంగిలిస్తారని చెప్పి ఓ వృద్ధురాలిని బురిడీ కొట్టించి ఆమె మెడలో ఉన్న 3తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లారు దుండగులు. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం పట్టణంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన పోతగల్ల పాపన్న అనే వృద్ధురాలు స్థానికంగా ఉన్న ఓ హోటల్ పనిచేస్తుంది. కాగా ఆమె పనిముగించుకొని మధ్యాహ్నం ఇంటికి నడుచుకొంటూ వెళ్తుండగా అన్నపూర్ణ హోటల్ సమీపంలో రోడ్డు పక్కన నిలబడిన గుర్తు తెలియని ఇద్దరు యువకులు పాపన్నను గమనించారు. అందులో ఓ యువకుడు నిన్ను ఓ వ్యక్తి పిలుస్తున్నాడని రోడ్డు పక్కకు రమ్మని అన్నారు. దాంతో ఆమె వారి వద్దకు వెళ్లింది. అందులో ఒకరు మెడలో బంగారం ఉంటే దొంగలు ఎత్తుకెళ్తారని చెబుతూ అతడి మెడలో ఉన్న గొలుసును తీసి పేపర్‌లో చుట్టి జేబులో వేసుకున్నాడు. నీవు కూడా ఇలానే నీ మెడలో ఉన్న బంగారు గొలుసు తీయమని చెప్పగా, ఆమె మా ఇల్లు దగ్గరనే ఉందని నేను వెళ్లిపోతానని చెప్పింది. దీంతో ఆమెను మాటలతో బురిడీ కొట్టించి ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును తీసి పేపర్‌లో చుట్టి ఆమె చీరకొంగులో కట్టారు. ఇంటికి వెళ్లిన తరువాత తిరిగి వేసుకోమ్మని చెప్పి అక్కడ నుంచి పరారయ్యారు. అనుమానం వచ్చిన ఆమె ఐదు నిమిషాల్లోనే అక్కడే కొంగులో కట్టిన పొట్లం విప్పిచూడగా అందులో గులక రాళ్లు కన్పించాయి. దాంతో వృద్ధురాలు బోరున విలపించగా రోడ్డున వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాడి ఎద్దులను ఢీకొని వ్యక్తి మృతి

మునుగోడు : రోడ్డుపై వెళ్తున్న కాడీ ఎద్దులను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి మండలంలోని కొంపల్లి సమీపంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన మార్ల కృష్ణయ్య(44) తన భార్య, కుమారైతో కలసి మునుగోడులోని శుభకార్యానికి సాయంత్రం 6గంటల సమయంలో తన బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో కొంపల్లి గ్రామసమీపంలో ఓ రైతు తన వ్యవసాయ భూమిలో గుంటకతోలి కాడి ఎడ్లతో ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కృష్ణయ్య తన బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో ఎడ్లపై ఉన్న కాడి విరిగిపోయి ఆ కాడిపై ఉన్న గొర్రు ఇనుపరాడ్లు కృష్ణయ్య కడుపులో బలంగా గుచ్చుకున్నాయి. అదే విధంగా బైక్‌పై ఉన్న భార్యతో పాటు కుమార్తై తలకు బలంగా గాయాలయ్యాయి. విషయం తెలిసిన బంధువులు వెంటనే అక్కడికి చేరుకొని చికిత్స నిమిత్తం హైదరబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో కృష్ణయ్య మృతి చెందగా, గాయపడిన భార్య, కుమార్తైలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి సోదరుడు శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితులను పట్టించిన ఆధార్ కార్డు

ఆత్మకూరు(ఎం) : ఓ చోరీ కేసులో నిందితులను పట్టించడంలో ఆధార్ కార్డు, సెల్ ఫోన్ నంబర్ కీలకంగా మారాయి. దీంతో పోలీసులు సకాలంలో చోరీ కేసును చేధించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కూరెళ్ల గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తుక్కాపురంలో ఈనెల 4న పానగాని స్వామి ఇంట్లో మాయమాటలు చెప్పి సినీఫక్కీలో చేసిన చోరీ కేసును సకాలంలో పోలీసులు చేధించారు. పోలీసులు చోరీ కేసును చేధించేందుకు నాలుగు రోజుల నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 1న తుక్కాపురం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కూరెళ్లలో మూడు సంచార జాతుల కుటుంబాలు దిగాయి. వారు తాత్కాలిక నివాసం కోసం అనుమతి ఇవ్వాలంటూ కూరెళ్ల గ్రామ సర్పంచ్ ఉప్పలయ్యయాదవ్ ఇంటికి వెళ్లి అడిగారు. దీంతో సర్పంచ్ వారి ఆధార్‌కార్డులు ఇవ్వాలని కోరడంతో వారి ఆధార్ కార్డును సర్పంచ్‌కు అందజేశారు. తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకున్న అనంతరం వారిలో లలిత అనే మహిళ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సెల్ ఫోన్ నుంచి వారి బంధువులకు ఫోన్ చేసింది. తుక్కాపురంలో చోరీ సంఘటన అనంతరం తాత్కాలిక నివాసాలు కనిపించకపోవడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందజేశారు. అప్పటికే గాలింపు చర్యలు ముమ్మరం చేసిన పోలీసులకు సర్పంచ్ ఉప్పలయ్యకు వారు అందజేసిన ఆధార్ కార్డు కీలకంగా మారింది. అంతే కాకుండా లలిత అనే మహిళ గ్రామస్తుడి సెల్‌ఫోన్ నుంచి ఎవరికి ఫోన్ చేశారన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. దీనికి తోడు గ్రామంలో నమోదైన సీసీ పుటేజీలను పరిశీలించి మండల కేంద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని పోలీసులు పట్టుకున్నారు.

ట్రాక్టర్ ఇంజన్ ఊడి.. ట్రాలీ బోల్తా పడి..

- అక్కడికక్కడే ఇద్దరు మహిళల దుర్మరణం.. ముగ్గురికి తీవ్ర గాయాలు
- వనవాసానికి వెళ్లొస్తుండగా దుర్ఘటన



మనిషా, చంద్రమ్మ మృతదేహాలు



ప్రమాదానికి గురైన ట్రాక్టర్ వద్ద గుమిగూడిన స్థానికులు

గరిడేపల్లి : ట్రాక్టర్ ఇంజన్ ఊడి ట్రాలీ బోల్తా పడడంతో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందగా పలువురికి గాయాలయ్యాయి. వన వాసానికి వెళ్లొస్తుండగా సూర్యాపేట జిల్లాలో ఈ విషాదకర ఘటన చోటు చేసుకుంది. గరిడేపల్లి మండలం కల్మల్‌చెరువు గ్రామానికి చెందిన ఓ సామాజిక వర్గం ఆదివారం బోనాల పండుక నిర్వహించుకుంది. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుడివాడకు చెందిన గోలి చంద్రమ్మ (38) కూడా వచ్చింది. ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించిన తర్వాత ఆ సామాజిక వర్గంలోని మూడు కుటుంబాల వారు సుమారు 20మంది ట్రాక్టర్‌లో కల్మల్‌చెరువు గ్రామ శివారులోని తమ వ్యవసాయ భూముల వద్దకు వనవాసానికి వెళ్లారు. అక్కడ వేడుక ముగిసిన తర్వాత అందరూ ట్రాక్టర్‌లో గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో జోరుగా వర్షం కురుస్తుండడంతో డ్రైవర్ ట్రాక్టర్‌ను వేగంగా నడిపాడు. మార్గమధ్యలోని ఒంపు ప్రాంతానికి రాగానే ట్రాక్టర్ ఇంజన్ వేరై ట్రాలీ బోల్తాపడింది. ప్రమాదంలో కల్మల్‌చెరువుకు చెందిన మనీషా(28)తో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుడివాడకు గోలి చంద్రమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. ఇదే గ్రామానికి చెందిన మీసాల సైదులు, మీసాల ఫాతిమా, బిల్లా కనకయ్యలకు తీవ్ర, పలువురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గరిడేపల్లి ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్

నల్లగొండ: నకిరేకల్ నియోజకవర్గానికి చెందిన మాద లింగస్వామిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాద లింగస్వామి కొంతమందితో కలిసి అధ్యక్షుడిగా ప్రకటించుకోవడం పార్టీ నిబంధనలను ఉల్లంఘించడమేనని అన్నారు. ఎవరికి వారు కమిటీలు వేసుకుంటే పార్టీ వాటిని గుర్తించదని స్పష్టం చేశారు. మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలు పరిశీలనలో ఉన్నాయని, నకిరేకల్ నియోజకవర్గంలో పార్టీకి సంబంధం లేకుండా వేసిన మండల కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



సత్తమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న జూలకంటి రంగారెడ్డి

నాగార్జునసాగర్ : బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం నందికొండ మున్సిపాలిటీలోని రెండో వార్డు కౌన్సిలర్ సత్తమ్మ ప్రథమ వర్ధంతికి హాజరై నూతనంగా ఏర్పాటు చేసిన ఆమె విగ్రహాన్ని ప్రారంభించి నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బంధు పథకాన్నీ బంధయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. ఆయన వెంట బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, తిరుమలగిరి సాగర్ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, సీపీఎం నాయకులు గోవర్ధన్, కోటిరెడ్డి, శంకర్, రమేష్, సారమ్మ తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పెద్దవూర : ఓ గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని లింగంపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. లింగంపల్లి గ్రామానికి చెందిన కట్టెబోయిన రామలింగయ్య(50) ఆదివారం సాయంత్రం తన ద్విచక్రవాహనంపై అనుముల గ్రామానికి వెళ్లాడు. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో గ్రామ సమీపంలోకి రాగానే కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం అతడి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రామలింగయ్య బైక్‌పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు.

చెట్టును ఢీకొని విద్యార్థి దుర్మరణం

కనగల్ : రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్ని ఓ విద్యార్థి గాయపడి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన నల్లగొండ పట్టణంలోని సాగర్‌రోడ్డు భాగ్యనగర్ వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బుడుమర్లపల్లి గ్రామానికి చెందిన విద్యుత్ లైన్‌మెన్ పోలె ఏలేష్‌స్వప్నలకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. చిన్న కుమారుడు పోలే లోహిత్ (15) భాగ్యనగర్‌లో వారి నివాసంలో ఉంటున్నాడు. లోహిత్ నోట్‌పుస్తకం కోసం తన స్నేహితుడి వద్దకు రాత్రి 9గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి స్కూటీపై వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురుకు రోడ్డు కనపడక ప్రమాదశాత్తు రోడ్డు పక్కన గల కానుగు చెట్టుకు స్కూటీతో ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టూ పక్కల వారు గమనించి లోహిత్‌ను నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. లోహిత్ నల్లగొండలోని సెయింట్ ఆల్ఫోన్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.

ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

- నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ముత్యాలమ్మ ఆలయం వద్ద మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మూడు రోజల పాటు నిర్వహించే ముత్యాలమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం ప్రారంభమాయ్యాయి. తొలి రోజు ఉత్సవాలలో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎంపీకి స్వాగతం పలికారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ.. ముత్యాలమ్మ దేవాలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, కాంగ్రెస్ ప్రభుత్వంలో నేను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడే దేవాలయానికి రోడ్లు ఇతర అభివృద్ధి చేశానని అన్నారు. ఆలయ కమిటీ సభ్యులకు కోరిక మేరకు ఎంపీ నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేస్తున్నానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తండు ప్రసాద్, గుండా రమేష్‌లు ఎంపీని శాలువా పూల మాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, యరగాని నాగన్న, తన్నీరు మల్లిఖార్జున్, కౌన్సిలర్లు కోతి సంపత్‌రెడ్డి, కస్తాల శ్రావణ్, రాజానాయక్, నాయకులు చక్ర వీరారెడ్డి, కుందూరు శ్రీనివాసరెడ్డి, జక్కుల మల్లయ్య, శివరాం యాదవ్, చింతకాయల రాము, బంటు సైదులు, వై.వీరబాబు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.